గెలుపు నీదే

కప్పగంతుల మల్లికార్జునరావు

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను–"

మూడేళ్ళక్రితం ఆ మాటలను విని సత్యవతి మురిసిపోయింది. తన అందాన్ని, యౌవనాన్ని నిలువుటద్దంలో చూచుకొని గర్వించింది.

అయితే యివాళ అవే మాటలు విని భయపడింది. అటూ యిటూ బెదురు చూపులు చూస్తూ నెమ్మదిగా అంది– "నాన్నగారు వింటారు జాగ్రత్త" అని.

ఆ మూడుమాటలను కలిపి చక్కని వాక్యంచేసి మురిపెంతో, ముచ్చటగా అన్నవాడు ఆనాడూ యీనాడూ వొక్కడే– మురళి.

'అన్ని నవలలు వ్రాసేవు. గొప్ప రచయిత్రి వనిపించుకొన్నావ్. యింకా నాన్నంటే భయమేనా?'

సత్యవతి అసహాయురాలిలా తల వంచుకొంది. మనసులో బాధపడుతున్నట్టు మొహంలో అలుముకొన్న నీలిమేఘాలు కళ్ళల్లో కమ్ముకొన్న కారు మేఘాలు చెప్తూనే వున్నాయి.

'వయసులోవున్న ఆడపిల్లవి – మనస్సులోమురిపెంతో పెంచుకొన్న కోరికలను నవలల్లోకి ధైర్యంగా ఎక్కించిన దానివి – యింకా నాన్నను చూచి భయపడటం బాగాలేదు సత్యా. ధైర్యం తెచ్చుకో. నాన్న కోపాన్నిచూచి బెదిరిపోకు. నిర్భయంగా ఎదురునిల్చి నీ మనసు విప్పిచెప్పు. కాదంటే ఎదిరించు. నీవెనుక నేనున్నాను –'

ఆ పిల్ల ఆపని చేయలేదని ఆమె కళ్ళల్లోని భీరుత్వమే చెప్తోంది. అయితే అలా చేయాలన్న కోరికా మరోవైపు కన్పిస్తూనేవుంది. కాగా మురళిమాటల్ని కాదనటం ఎలా?

నిజానికి సత్యవతి చిన్నతనంనుంచి పెరిగిన వాతావరణం, స్వేచ్ఛా స్వాతంత్ర్య ప్రవృత్తికి. స్వకీయమైన ఆలోచనాశక్తికి ప్రేరణ యిచ్చేటటువంటిది కాదు.

ఆ యింట్లో డబ్బుకు కొరతలేదు. పుట్టినదగ్గరనుంచి ఆ పిల్ల పరుపులమీదనే నడిచింది. మల్లెపూల సెజ్జలపైనే పడుకొంది.

అందుకే ఆ అమ్మాయికి, నేలకూ దూరం. ఆకాశవిహారంతప్ప, నేలమీద నడవటం చాతకాలేదు.

ఊహ పూర్తిగా తెలియకముందే తల్లి మరణించింది. తండ్రికి పిల్లల్ని

కనటంతప్ప పెంచటం బొత్తిగా తెలియదు.

వృత్తి చేత రంగారావు న్యాయవాది. కానీ ఆయన ఆలోచన లెప్పుడూ అన్యాయంగానే వుండేవి.

ఊరంతా తన కనుసైగల్లో కదలాలని ఆయనకో పెద్దకోరిక. ఆ కోరిక తీర్చుకోటానికాయన ముందు యింటి నుంచి బయలుదేరేడు.

బ్రతికున్నంతకాలం భార్య ఆయన చెప్పుచేతల్లో నలిగిపోయింది.

పెద్దవాడు 'లా' చదువుతానంటే— 'లా' దేముందోయ్? మనం సమర్థులమైతే లా చదవకపోయినా, మనం చెప్పిందే 'లా' అవుతుంది. మెడిసన్ చదువు—' అని ఆర్డర్ వేశాడు.

రెండోవాడికి నాటకాలంటే పిచ్చి. తండ్రికి తెలీకుండా నాలుగు నాటకాల్లో వేషాలువేసి మంచి నటుడని పేరుతెచ్చుకొన్నాడు. అది తెల్సేసరి, నాటకాలు గీటకాలు కట్టిపారేసి, హాస్టల్లోవుండి ఇంజనీరింగ్ చదవమని శాసించాడు రంగారావు.

ఊహతెల్సిన దగ్గర్నుంచి నాన్నంటే భయమే సత్యవతికి. వయసు పెరిగేకొద్ది ఆమెలో కోరికలు వొక్కొక్కటి విచ్చుకోసాగేయి.

తనూ స్కూల్లో తన స్నేహితురాళ్ళ లాగా ఆడుకోవాలి. వేరుశనగ పప్పులు తింటూ షికార్లు చేయాలి. సినిమాలు చూడాలి. పత్రికల్లో నవలలు చదివి స్నేహితురాళ్ళతో మంచిచెడ్డలను గురించి చర్చించాలి.

కానీ అవన్నీ తీరని కోరికలే. కారణం? తండ్రి ఆలోచనలకు అవి భిన్నం కావటమే.

కారు తనని సరిగ్గా స్కూలు వద్ద వదిలి వెళ్తుంది. యీలోగా స్నేహితులతో అనవసర సంభాషణలు చేయరాదు. క్లాసు పుస్తకాలుతప్ప పత్రికలు, నవలలు చదవరాదు. తండ్రి ఆజ్ఞకు భంగంగా అలాంటి పనులు చేస్తే, వెంటనే ఆయనకు తెలుస్తుంది. అందుకు ఆయన ఏర్పాట్లు చేసుకొన్నాడు.

అందుకే సత్యవతి చిన్నతనంనుంచి యిలాంటి కోరికలు పెంచుకోలేదు. తన స్వల్ప పరిధిలో కూర్చునే బంగారుకలలు కంది.

తండ్రి, అన్నలు, నౌకర్లు మొదలైన వారంతా తనను ఎంతో ప్రేమగా చూస్తున్నట్లు, తను కోరినదల్లా కాదనకుండా కోరినదే తడువుగా తీరుస్తున్నట్లు కలలు కని తృప్తిపడేది.

ఇంట్లో అలా తన ఆధిక్యతను నిలబెట్టు కొన్నాక, రంగారావు దృష్టిని బయటికి సారించి, తన వృత్తిమీద కేంద్రీకరించాడు.

వస్తుతః వృత్తిలో అంత ప్రతిభాశాలి కాదు రంగారావు. న్యాయధర్మాలు, సూక్ష్మాలను గురించి ఆలోచించేతత్వమూ

కాదు – అందుక్కావల్సిన వోపికా లేదు.

అయితే చిరకాలంగా ఆ వూళ్ళో వున్నవాడు. కాగా వారి కుటుంబం ఆ వూళ్ళో ప్రసిద్ధమైనది. తండ్రిచేసిందీ న్యాయవాదవృత్తే. ఆ వృత్తిలో ఆయన ఎంతో శోభించి 'ఫలానివాడు మంచి ప్లీడరు' అన్న పేరును వదిలి వెళ్లేడు. తండ్రి వదిలి వెళ్ళిన ఆ పేరును నేర్పుగా వాడుకొని వృత్తిలో నిలబడ్డాడు.

అంతేకాదు వృత్తిలో 'షైన్' కావటానికి కొన్ని విపరీతమైన పద్ధతుల్ని అవలంబించాడు రంగారావు. తనకు స్వయం ప్రతిభతో, వృత్తిలో రాణించే నేర్పు ఎలాగూ లేదని రంగారావుకుతెల్సు. అందుకని – 'యిటునుంచి కాకపోతే అటునుంచి నరుక్కొద్దాం' – అన్న పద్ధతిలో, ప్రత్యర్థులను పడగొట్టటంలో నేర్పు సాధించాడు.

రంగారావుది భారీ విగ్రహం. విశాలమైన నుదురు, పెద్దపెద్ద కళ్లు, వెడల్పయినపెదవులపైన గుబురైనమీసాలు– చూడగానే ఎంతవాడికీ భయం పుట్టేలా వుంటుందాయన విగ్రహం. అందుకు తోడు ఖంగుమనిమోగే కంఠం. కాగా తప్పులో వొప్పులో ధారాళంగా మాటల్ని దొర్లించేయగలడు.

భగవంతుడిచ్చిన ఆ మహాకాయాన్ని, ఆ గొంతును, ఆ వాక్ప్రవాహ సౌభాగ్యాన్ని ఆయన చక్కగా వినియోగించుకొన్నాడు.

పాయింట్లు లేకపోయినా గబగబ మాట్లాడి కోర్టు హాలును అదరగొట్టేవాడు. ప్రత్యర్థి వకీలు 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' అంటూ లేవబోయాడా, రంగారావు గుడ్లురిమి చూచేవాడు – 'వాకిట్లోకి రా నీపని పడ్తా' అన్నట్టు.

పైగా ఆ వూళ్ళో అతనికంటూ వో గ్రూపు వుంది. ఆ గ్రూపుకు రాజకీయపు రంగు పూసేడు రంగారావు. తనేనాటికైనా పెద్ద రాజకీయవేత్త కావాలన్న కోరికకు ఈ గ్రూపును నాందిగా నిర్మించుకొన్నాడు. అయితే అది నిజానికి రౌడీ గ్రూపు.

ఆ గ్రూపులో వాళ్ళు చేసే అన్యాయమైన పనులన్నిటినీ వెనకేసుకొచ్చి వకాల్తా పుచ్చుకొని కోర్టులో వాదించేవాడు.

రంగారావు కయిష్టమైనపని ఆ వూళ్ళో ఏది జరిగినా ఆ రౌడీగ్రూపు కొట్లాటకు తయారవుతుంది. కొట్లాటలు ముదిరి వ్యవహారం కేసులు, కోర్టులుదాకావస్తే రంగారావుకు రెండు లాభాలు. అటు తన పని నెరవేరుతుంది, ఇటు కోర్టులో తన ఫైలు పెరుగుతుంది.

అందుకే ఆ వూళ్ళో చాలా మంది రంగారావును ఆ పేరుపెట్టి పిలవరు. 'రౌడీ ప్లీడరు' అని కొందరు ముద్దుగా అంటే, మరి కొందరు కచ్చగా అనుకుంటారు.

అవతలి పార్టీ ప్లీడరు సిద్ధంగా లేనప్పుడు, సాక్షులు రానప్పుడు, సమయం చూచి కేసును విచారణకు పెట్టేలా చేసేవాడు రంగారావు.

కోర్టు గుమాస్తాలంతా రంగారావు బంధువులే. ప్రతి పండక్కి మామూలు లాగా, అంతో యింతో యిచ్చి వారి చేయి తడిచేసి, వారిని తన చేతిలో వుంచుకొన్నాడు.

ఇలా ఇంటా బయటా ఎదురులేకుండా సాగిపోతున్న రంగారావును మొట్టమొదటిసారిగా ముఖాముఖీగా ఎదుర్కొన్నవాడు మురళి.

మూడేళ్ళ క్రితం మురళి బి. ఎ. ఫైనల్ యియర్ చదువుతుండేవాడు. సత్యవతి ఆ యేడే పి. యు. సి. పాసై బి. ఎ. లోకి వచ్చింది.

అసలు రంగారావు సత్యవతి చదువుకు యస్సెల్సితోనే స్వస్తిచెప్పాలనుకొన్నాడు. తన అభిప్రాయాన్ని కూతురుతో చెప్పేడు.

కొడుకుల్లాగానే కూతురూ, తన కోరిక చెప్తుందని ఆశించాడు. అలా చెప్తే అదిలించి మూల కూర్చోపెడ్దామని కూడా నిర్ణయించుకొన్నాడు.

కాని సత్యవతి తండ్రి అభిప్రాయాన్ని విని ఎదురుచెప్పలేదు. కంటనీరు కుక్కుకుంటూ, నిశ్శబ్దంగా అవతలికి వెళ్ళింది.

ఆమె వెంట రంగారావుకూడా లోపలికెళ్లేడు. అప్పటికే సత్యవతి కళ్ళల్లో నీళ్ళు కట్టలు తెంచుకొన్నాయి.

వెళ్ళి కూతురు శిరస్సుమీద చెయ్యివేశాడు. ఏదో వింత అనుభూతి!...తన దన్న మమకారం పెల్లుబికింది.

'పైకి చదువుకోవాలని వుందా తల్లీ?'

సత్యవతి ఆశగా తండ్రివైపు చూచింది.

'చదువుకోమ్మా. నీవు చదువుకోవాలంటే నేను కాదంటానా?' అన్నాడు కన్నీళ్లు తుడుస్తూ. ఆ తర్వాత తనన్న మాటలకు తానే ఆశ్చర్యపోయాడు రంగారావు!

తండ్రిప్రేమను సత్యవతి అనుభవించిందా ఒక్కరోజే!

కాలేజీలో చేరేక ఆ వాతావరణం చాలా కొత్తగా కన్పించింది. ఏదో పులకరింత కుర్రాళ్లు తన వంక చూస్తుంటే!

స్కూల్లోకూడా కుర్రాళ్లు ఆమెవంక చూచేవారే. అయితే ఆ చూపుల్లో యీ 'చురక' లేదు, వేడి లేదు. యిక్కడి కుర్రాళ్ళు వేడివేడిగా తనవంకచూస్తుంటే వళ్ళంతా చురుక్కు చురుక్కుమంటూ ఏదో వింత అనుభూతి! అందరిలోకీ ఆ యువకుడు – అబ్బ – ఏంచూపో అతనిది? ఎలా నవ్వుతాడో?

అయితే అన్ని ఆలోచనలూ, అనుభూతులూ మనసులోనే. కార్యక్రమం మామూలే. కారులో రావటం, క్లాసులో కూర్చోవటం, కారులో యింటికెళ్ళటం.

అలవాటుచొప్పున ఆ రోజు కాలేజీలోపల్నుంచి కారువద్దకు బయల్దేరింది.

'క్షమించండి సత్యాదేవిగారూ–ఒక్క నిముషం–'

కళ్లెత్తి అతనివైపు వోరగాచూచింది. అతనే... అతనే! నవ్వుతూ ఎదురుగా నిల్చునివున్నాడు – తనవంకే ఆప్యాయంగా చూస్తూ. చురక ఘట్టిగా తగిలింది.

'నాపేరు మురళి. బి. ఎ. ఫైనల్ యియర్ –'

'మురళి' అన్న పేరులో అంత మాధుర్యముందని సత్యవతికి అంతక్రితం తెలీదు. 'మురళి ... మురళి ... ఎంత బాగుంది పేరు–' మనసులోనే అనుకొంది.

మురళి అందమైనవాడే. పొడుగు – పొడుగుకు తగ్గ లావు. చామనిచాయ, చక్కని మీసం, మెత్తటి నల్లటి జుట్టు, పెద్ద కళ్లు. ఆకర్షించే శక్తి వుంది అతనిలో.

'అనవసరపు ఉపోద్ఘాతాలు, పనికిమాలిన 'ఫార్మాలిటీస్' అంటే నా కిష్టం లేదు. మీరనుమతిస్తే సూటిగా అసలు విషయానికొస్తాను –'

'చెప్పండి–' అన్నట్టు సత్యవతి కళ్లు టపటపలాడాయి.

''నేను నిన్ను ప్రేమిస్తున్నాను.''

ఆ మూడు మాటలు విని సత్యవతి మురిసిపోయింది. హృదయం ఆనందంతో వేగంగా కొట్టుకుంది.

అయితే అంతలోనే అతని ఏకవచన సంబోధన గుర్తుకొచ్చింది. క్షణంక్రితం పరిచయం? అప్పుడే తనని అతని సొత్తు చేసుకున్నట్లు ఏమిటా పిలుపు? ఎంత సాహసం?

'ఏకవచనంలో సంబోధించానని ఆలోచిస్తున్నట్లున్నారు. కావాలనే అలా అన్నాను. ప్రేమను వ్యక్తంచేయటానికి అదే మంచి మార్గమని అలా పిలిచాను. కష్టంవేస్తే క్షమించండి.

'ఇంతకీ మీకు పెళ్ళి చేసుకోవాలని వుందా? ఉంటేమాత్రం నేనో అప్లికేషన్ యిందు వెంట దాఖలుపర్చుకుంటున్నాను. కట్నాలు కానుకలూ అన్నీ మీ ప్రేమలోనే స్వీకరిస్తాను. చదువు, సంస్కారం, తెలివితేటలు, భగవంతుడిచ్చిన యీ శరీరం, శక్తితప్ప చెప్పుకోదగ్గ ఆస్తులంటూ నాకు పెద్దగా ఏమీలేవు. నా అప్లికేషన్ పరిశీలించి ఆజ్ఞలు జారీ చేయండి.'

అతను వెళ్ళిపోగానే ఏదో కొరత!... అలాగే అతని సన్నిధిలో వుంటే ఎంత బాగుండును?

ఇంటికెళ్ళి తన అందాన్ని నిలువుటద్దంలో పరీక్షగా చూచుకొంది సత్యవతి. చూచుకొని గర్వించింది. తన పక్కన అతన్ని నిలబెట్టుకొని చూచుకొని మురిసిపోయింది.

అతన్ని గురించి ఆలోచించేకొద్దీ, ఆమె మనసు పూల వుయ్యాలలా పరిమళిస్తూ వూగసాగింది. చేసుకొంటే అతన్నే పెళ్ళిచేసుకోవాలి. యీతడవ అతను అడిగితే అదే చెప్పాలనుకుంది.

కానీ తీరా వారంతర్వాత అతను ఎదురై 'నా అప్లికేషన్‌పై ఏం ఆర్డర్సు వేశారు?' అని అడిగినప్పుడు 'మా నాన్న గారికి దాఖలుచేశాను. వారిని అడగండి' అంది తనూ చిలిపిగానే.

అయితే చిలిపిగా ఆనాడన్న ఆ మాట, తర్వాత నిజంగానే అతను తనతండ్రి



నడిగినప్పుడు అంతగా విషమిస్తుందను కోలేదు.

'ఊ... అయితే నా కూతుర్ని ప్రేమిస్తున్నానంటావ్?' రంగారావు మీసాలు దువ్వుకొని చుట్ట వెలిగించి కళ్లు పెద్దవిచేసి చూస్తూ గంభీరంగా అన్నాడు.

'నా కూతుర్ని ప్రేమించటానికి నీకు గల అర్హత లేమిటి?'

'ప్రేమించగల మంచి హృదయం కలిగివుండటం మాత్రమే.'

'సిగ్గులేదటోయ్ ఆ జవాబిచ్చి నా కూతుర్ని అడగటానికి?'

మురళి చటుక్కున తలఎత్తి చూచాడు. అతని కళ్లలో నిప్పురవ్వపడింది.

'ప్రేమించగల హృదయం వుందిట. నీకేనా ఆ బోడి హృదయం వుంది!? అందమైన ఆడపిల్లను, అందునా డబ్బుకలవారింటి ఆడపడుచును, చూస్తే ప్రతి వెధవకి హృదయాలు మొలుచుకొస్తాయి.

'నువ్వేమైనా వో డాక్టరువా? ఇంజనీరువా? ప్లీడరువా? కనీసం గుమాస్తావన్నా కావే? ఆఫ్టరాల్ బి..ఎ. విద్యార్థివి. ఆ బి. ఎ. కాగానే పిల్చి కలెక్టరును చేస్తారనుకుంటున్నావా ఏమిటి? అయినా నా అంతస్థెక్కడ? నీ అంతస్థేమిటి? సిగ్గు లేక నా ఎదుటి కొచ్చి నా ముందు నిలబడి నా కూతుర్ని ప్రేమించానంటావా? మళ్లీ వో మారిలా చేస్తే మూతిపళ్లు రాలగొడ్తాను.'

'పళ్లు రాలగొట్టటం మీ కొక్కరికే కాదు చాతనయింది. నాకూ చాతనవును.' కుర్చీలో కూర్చొని కాళ్లు స్టూలుమీద పెట్టి ఠీవిగా అన్నాడు మురళి.

అతని పద్ధతి చూచి చటుక్కున కుర్చీలోనుంచి లేచాడు రంగారావు.

'మర్యాద అనేదాన్ని మనం యిస్తేనే మన కొకరిచ్చేది. డాక్టరు, ఇంజనీరు, ప్లీడర్లకే మీ అమ్మాయి నిస్తానంటే, ఆల్‌రైట్, నా కభ్యంతరం లేదు. మీ అమ్మాయి నా కవసరం అనుకొంటే నేనే వాటిలో ఏదో ఒకటయి అప్లికేషన్ 'రెన్యూ' చేస్తాను. కానీ 'రౌడీ' తనాన్ని కోర్టులో చూపిస్తే సరిపోతుంది కాని, ప్రతివాళ్ళ దగ్గర పనికొస్తుందనుకోకండి. మొదటిసారి కనుక యింతటితో సరిపుస్తున్నా—' అంతదూరం వెళ్ళిన వాడు కాస్తాఆగి వెనక్కి చూస్తూ అన్నాడు: 'యివాళ మీచేత తిరస్కరింపబడ్డాను. మరోరోజు మీరేపిల్చి మీ పిల్లనిస్తా మంటాడు. అంతవరకు శెలవ్—' చక చకా వెళ్ళి పోయాడు.

రంగారావు స్థాణువే అయ్యాడు. అంతావిన్న సత్యవతికి అతనిపైన ప్రేమ ఎక్కువయింది. ఆ తర్వాత సత్యవతి చదువు ఆగిపోయింది.

'నేను నిన్ను యింకా ప్రేమిస్తున్నాను. నన్ను నిజంగా నువ్వు ప్రేమిస్తుంటే మూడేళ్లు నాకోసం ఆగలేవా సత్యా?'

ఉత్తరాన్ని హృదయానికి హత్తుకొని, పెట్టెలో దాచిపెట్టూ అనుకొంది సత్యవతి— 'మూడేళ్లు ఆగితే ఆతర్వాత ఏంచేస్తాడో, అసలీ మూడేళ్లు ఏంచేస్తాడో?'

అతనేంచేస్తేనేంకాక కానీ, యీ మూడేళ్ళలో సత్యవతి జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమయింది.

మనసులో పేరుకానిపోతున్న కోరి కల బరువుభారం పెరిగిపోయింది. మురళితో రానున్న తన జీవితాన్ని గురించిన కలలు ఎక్కువయ్యాయి. తీరని కోరికల్ని, కంటున్న కలలని కాగితం మీద పెట్టింది. నవలా రూపంలో అందంగా, ఆకర్షణీయంగా వ్రాసి పత్రి కల్లో ప్రచురించింది.

ప్రతి స్త్రీకి అందమైన భర్తనుపొందా లని, ఆ భర్తతో 'ప్లిమత్' కారులో సాయంత్రం బీచివొడ్డున షికారుచేసి, రాత్రికి పెద్దహోటల్లో రూఫ్‌గార్డెన్‌లో భోంచేసి, ఇంగ్లిషు సినిమాకు పోవా లని; కాశ్మీర్‌లో ప్రకృతి దృశ్యాల మధ్య భర్తమీదవొరిగి అందంగా నడవా లనీ; తనవాళ్ళంతా తనని కంటిపాప లాగా చూడాలని; తనకాల్లో ముల్లుగుచ్చు కొంటే యింటిల్లిపాదీ కాళ్ళరిగేలాగా అటూయిటూ పరుగెత్తాలనీ; యిలాంటి కోరికలు వుండడంలో అసహజమేం లేదు. అయితే యీ కోరికలు మనసులో అడుగుపొరల్లో వుంటాయి. నిజ జీవి తానుభవమువల్ల, అడుగుపొరల్లోని ఆ కోరికలు అక్కడే వుండిపోతాయి.

ఒంటరిజీవితం, బందిఖానబతుకు, సత్యవతిలోని యీ కోరికలకు వూపిరి పోసి వెలికితెచ్చాయి. నవలల్లో ఆమె ఆలోచనలూ అలాగే కొనసాగాయి.

ఇప్పుడామె నవలలు చదివేక చాలా మంది స్త్రీలలో, ముఖ్యంగా యువతుల్లో యీ కోరికలు విజృంభించాయి. అయితే అవి తీరేదెలా ? ఆమె వ్రాసిన నవలల్నే మళ్లీ మళ్లీ చదివి మానసికానందాన్ని పొందసాగారు.

సత్యవతి ప్రసిద్ధ రచయిత్రి అయింది. పత్రికలు, ప్రజలు ఆమె నవలలకోసం ఎగబడ్డారు.

మూడేళ్ళలో పదినవలలు వ్రాసింది. పదివేలకుపైగా సంపాదించింది.

రంగారావు కూతురి యీ వ్యాసంగాన్ని కాదనలేదు. కాగా ప్రోత్సహించాడు కూడా. కారణాలు రెండు: 'ఫలాని అమ్మాయి తండ్రి' అని తనకూ పేరువస్తోంది; డబ్బూ వస్తోంది.

అయితే ఆమె నిజజీవితంలో మార్పు లేదు. రచయిత్రి సత్యవతికొచ్చే కట్టల కట్టల అభిమానుల ఉత్తరాలను చదివే వాడు రంగారావే. చూచిపోదామనివచ్చిన వాళ్ళకు లభ్యమయ్యేది రంగారావు దర్శనమాత్రమే.

ఆ మూడేళ్ళు ప్రతినిముషం మురళిని గూర్చి ఆలోచించింది సత్యవతి.

అయితే రంగారావుమాత్రం కూతురి పెళ్ళివిషయం వొక్కక్షణంకూడా ఆలోచించలేదు.

* * *

'నేనతన్ని ప్రేమించాను నాన్నగారూ. పెళ్ళి చేసుకొంటాను—'

కూతురుమాటల్తో రంగారావు కళ్ళు నిప్పుకణికలయ్యాయి— అతన్ని ప్రేమిస్తు

న్నానని కూతురు అన్నందుకు కాదు– తన ఎదుట నిల్చి ధైర్యంగా కూతురు ఆ విషయాన్ని చెప్పినందుకు.

'ఎవర్ని ?' అని అడుగుతాడనుకొంది సత్యవతి. కాని రంగారావు అడగలేదు.

సత్యవతి అతనితో మాట్లాడటం– అలా మాట్లాడుతున్నప్పుడు కూతురి మొహంలో కన్పించే కోటిదీపాల వెలుగు – ఆయన చాలాసార్లు చూచాడు– చూడనట్లు వూరుకున్నాడు.

కారణం ? కూతురు పెళ్లీడు కొచ్చిందని, పెళ్ళిచేయక తప్పదని రంగారావుకు తెల్సు. మరి, అతను – నల్లగౌను తొడిగిన నాలుగునెలలకే, తలనెరసిన ప్లీడర్ల చేత 'భేష్' అనిపించు కొన్నవాడు అతను తన అల్లుడుకావటం తనకిగొప్ప– తన తెలివితేటలకు గీటురాయి.

రంగారావుకి అతన్ని చూచిన్నాడే అభిమానం కలిగింది.

ఆనాడు రంగారావుకి బాగాగుర్తు–

సీనియర్ ప్లీడర్ సీతారామయ్యగారి నెలా దెబ్బకొట్టడమా అని ఆలోచిస్తూ కూర్చున్నాడు 'బార్' రూమ్‌లో.

'నమస్కారం రంగారావుగారూ. గుర్తున్నానా నేను ?'

నిజానికి తనెవరో గుర్తులేదు రంగారావుకు అయినా ఆ విషయాన్ని ఒప్పుకొనే తత్వం కాదాయనది.

'ఎంతమాట ? నువ్వు గుర్తు లేకపోవడ మేమిటోయ్ ? బాగున్నావా ?' అన్నాడు.

'గుర్తుంటే మన పరిచయం ఎక్కడో చెప్పండి చూద్దాం –'

రంగారావు యీ పరిస్థితిని వూహించలేదు. వెలక్కాయ నోట్లో పడ్డట్లయింది.

'మీకు గుర్తులేదు. నామీదఅభిమానం కొద్ది అలా నటిస్తున్నారు. అవునా ?'

అయినా యిత నెక్కడి మనిషి ? యింత నిర్మొహమాటంగా మాట్లాడుతున్నాడు ? !

'వాస్తవం చెప్పాలంటే నాకూ జ్ఞాపకం లేదుసార్. బహుశా మానాన్నగారివద్ద కొచ్చినప్పుడు చూచానేమో. మానాన్నగారు మీకు తెల్సుననుకొంటా–'

తెల్సునంటే ఏమో ? తెలీదంటే ఏమో? అందుకే ఏమీ మాట్లాడలేదు.

'సరే అసలువిషయాని కొస్తా. నేను 'లా' పాసయ్యాను. ఈ వూళ్ళో ప్రాక్టీస్ చేయమన్నారు నాన్నగారు. మొదటిసారిగా ఈవాళే కోర్టుకు రావటం. కేసు వాదించేముందు మీ ఆశీస్సు తీసుకోమన్నారు నాన్న అందుకే వచ్చా–'

రంగారావు ఉబ్బిపోయాడు. అతని మాటల్లోని ఆకర్షణకు బానిసయ్యాడు. తనకు జూనియర్‌గా యిలాంటి కుర్రవాడుంటే ?...అదే అడిగాడు.

అతను చాలా బాధపడ్తున్నట్టుగా మొహంపెట్టేడు. ఒక్క క్షణం ఆగి చాలా విచారంగా అన్నాడు– "నిజంగా నేను

చాలా దురదృష్టవంతుణ్ణిసార్. లేకపోతే యింతటి సదవకాశాన్ని వుపయోగించుకో లేని స్థితిలో వుంటానా ? మూడురోజులే అయిందిసార్ – సీతారామయ్యగారివద్ద జూనియర్‌గా చేరి. మీరిలా నామీద దయ చూపిస్తారని తెలిస్తే...''

సీతారామయ్య జూనియర్ అని విని గానే రంగారావు ఆలోచన యివాళ తన కేసుమీదికి పోయింది.

తను యివాళ వాదించాల్సిన కేసుకు యితన్ని పంపిస్తే బాగుండును. కొత్త వాడు. ముప్పతిప్పలుపెట్టి తనప్రజ్ఞ చూపవచ్చు – అనుకొన్నాడు.

కోర్టుగుమాస్తాలవద్దకెళ్లి అవసరమైన 'బోల్టు' లను బిగించుకొని వచ్చాడు.

అదృష్టం. సీతారామయ్య జూని యర్‌గా అతనేవచ్చాడు. అనుకొన్నట్టు గానే వాయిదా అడిగాడు.

రంగారావు అభ్యంతరం తెలిపాడు – సీనియర్ రిక్వెస్ట్‌లేందే వాయిదా వేయ టానికి వీల్లేదని.

కేసు వింటామన్నారు కోర్టువారు.

అయిపోయింది, కేసు గెల్చాననుకు న్నాడు రంగారావు. అబ్బాయి తేలగుడ్లు వేస్తాడని ఆశించాడు.

అతను వాదన సాగించాడు.

అరగంట అయింది. కోర్టు నిశ్శ బ్దంగా వింటోంది. ఎవరీ కుర్రవాడు ? ఏమి పరిశీలనాశక్తి ? ఏం వాగ్ధాటి ?

రంగారావే తేలగుడ్లు వేయాల్సి వచ్చింది.

కేసు అతనిపక్షమయింది.

'క్షమించండి. మొదటికేస్ మీకు వ్యతిరేకంగా వాదించాల్సివచ్చింది. పిల్ల వాడని మీరు దయతల్చి వదిలేయబట్టి సరిపోయింది కాని – లేకపోతే యివాళ చాలా భయపడ్డానుసార్ !' అంతవరకు కేసు పోయినందుకు విచారం. యిప్పుడో ! కేసుపోయినా, అది తను కావల్సి వదిలి వేయటంవల్ల పోయిందన్న తృప్తి. తన గొప్పతనాన్ని అతను గుర్తించినందుకు ఆనందం !

'ఏమైనా కోర్టులో మనం శత్రువులం. బయటకొచ్చాక మిత్రులం – బంధువులం. చిత్రంకదూ సార్ యీ ప్రొఫెషన్ ?'

రంగారావు అతని ఆకర్షణకు లొంగి పోయాడు. మాటరాక నవ్వాడు.

మొదటి నాలుగునెలల్లోనే అతను బాగా ఎదిగిపోయాడు. ఎవరినోటవిన్నా అతనిపేరే, పొగడ్తే.

అదేం ఖర్మోకాని, అతను గెల్చిన చాలాకేసులు రంగారావుకువ్యతిరేకంగానే.

రంగారావుకు అతన్ని చూచేకొద్దీ అతనిచేతిలో వోడేకొద్దీ, అతన్ని తన జూనియర్ చేసుకోవాలన్న కోరిక పెరగసాగింది. అందువల్ల రెండు లాభాలు. తన ప్రత్యర్థి తనవాడై పోతాడు. తనఫైలు పెరుగుతుంది.

కాస ఎలా ?

అతనితో స్నేహంచేశాడు. ఇంటికి పిల్చాడు. విందులిచ్చాడు. కూతుర్ని పరిచయం చేశాడు.

రాకపోకలు పెరిగాయి.

జూనియర్ చేసుకొందామని రంగారావు గాలంవేస్తే, అల్లుడు కావటానికి అతను ఎత్తువేశాడు.

'ఏమిటి నాన్నగారూ ఆలోచిస్తున్నారు ?'

రంగారావు కూతురువైపు చూచాడు. కాస్తసర్దుకొని కూర్చొని తలవూపుతూ అన్నాడు-'అయితే అతన్ని ప్రేమించావంటావు ? మరి అతను నిన్ను ప్రేమించాలిగా ? ప్రేమిస్తున్నానని నీతో చెప్పాడా ?'

చెప్పేడన్నట్లు తల ఆడించింది.

రంగారావుకు కోపంవచ్చింది. ఆ విషయం చిన్నపిల్లదగ్గరి కెళ్ళి చెప్పే బదులు తనతో చెప్తేనేం ? కాదంటాడా తను ?

'నా దగ్గరి కొచ్చి నా కూతుర్నివ్వమని అడిగేదాకా యీ ప్రేమల్నీ, పెళ్ళిళ్ళను నేను అంగీకరించను-' గట్టిగా అన్నాడు.

'అతను మీవద్దకొచ్చి అడగట్ట-'

'అడగడూ ?'

'ఆడపిల్ల తండ్రి - మీ నాన్నగారే నన్ను అడగాలని చెప్పాడు.'

రంగారావు ఆలోచించాడు. తను అడిగితే ఒప్పుకొంటా డన్నమాట !

'ఊఁ...'

ఇంత విని ఆఖరికి 'ఊఁ'తో పూరు కొన్నాడంటే అవతలవాడు చెప్పింది అంగీకరించినట్లేనని అర్థం.

రంగారావు వెళ్లేసరికి అత నేదో పుస్తకం చదువుతున్నాడు. ఆయన్ని మర్యాదచేశాడు.

'మీరు - కష్టపడి మీ రింతదూరం రావాలా? కాకితోకబురు పంపిస్తే...'

రంగారావు పొంగిపోయా డతని మాటలకు.

'నువ్వు వొచ్చేపనికాదు లే వోయ్. ఆడపిల్ల తండ్రిని - నేను రావల్సినపనే. అమ్మాయి అంతా చెప్పింది లేవోయ్-'

అతను ముసిముసి నవ్వులు నవ్వాడు.

'అమ్మాయి నిన్నే ప్రేమిస్తున్నదిట. నిన్నే పెళ్ళి చేసుకొంటానని - అది వ్రాసిన నవలల్లో కథానాయికలాగా తెగేసి చెప్పింది. ఎలా కాదనను చెప్పు ? నీకూ అభ్యంతరం లేకపోతే...'

'నా కేం అభ్యంతరం లేదు కానీండి, మీరే బాగా ఆలోచించడని నా సలహా. నే నేం డాక్టరును కాను, ఇంజనీరును కాను, నిన్నుగాక మొన్న బోర్డుకట్టిన ప్లీడర్ని-'

రంగారావుకి మాటలు ఎక్కడో విన్నట్లనిపించింది. పరీక్షగా అతనివైపు చూచాడు.



'ప్లీడరుబోర్డు కట్టగానే కేసులొస్తాయన్న గ్యారంటీ ఏమిటి? ... ప్రేమించే మంచిహృదయం తప్ప. నాలో ఏం చూచి మీ అమ్మాయిని నా కిస్తామంటున్నారు?'

రంగారావుకి అతనితో పరిచయం ఎక్కడయిందీ యిప్పుడు జ్ఞాపకం వచ్చింది.

'అయినా మీ రడుగుతున్నారు కనుక— ఆల్ రైట్ — మీ అమ్మాయిని పెళ్ళి చేసుకోటానికి వొప్పుకొంటున్నాను—' ఆ అనటంలో ఠీవివుంది, అమాయకత్వం వుంది, ప్రేమవుంది.

అయితే ఆనాడు అన్నమాటను అతను అక్షరాలా నెరవేర్చుకొన్నా డన్నమాట! తనని ఓడించా డన్నమాట.

అయినా అతను తనని యివాళ ఓడించట మేమిటి? నల్లగౌను వేసుకొన్న మొదటిరోజే మాటల్తో ఓడగొట్టేడు. ఆ తర్వాత కేసులో ఓడించాడు. అలా ఎన్నిసార్లు తనని — తన వ్యూహాల్ని తారుమారుచేసి ఓడగొట్టలేదు కనుక? — అయినా తనకి కోపంరాలేదు, పైగా ప్రేమే పెరిగింది.

రంగారావు నవ్వుకున్నాడు ఆనందంగా.

'జయించావోయ్ అల్లుడూ...నువ్వే జయించావు. ఒప్పుకొన్నా—' భుజం మీద గట్టిగాచరుస్తూ ప్రేమగా అన్నాడు. 'కాని నీకు వూరికే అమ్మాయిని యివ్వటంలేదు. కన్యాశుల్కంగా నువ్వా సీతా

రామయ్యను వదిలి నాదగ్గర జూనియ ర్‌గా చేరాలి–'

అతను నవ్వేడు – 'అంటే మీ రింకా ప్లీడరువృత్తి సాగిద్దా మనుకొంటున్నా రన్నమాట! నేనుండగా మీ కెందుకు సార్ యింకా ఆ శ్రమ? ఆ పనులన్నీ నేను చూచుకొంటాగా? మీరు హాయిగా ఆ వృత్తిమానేసి–'

'అయితే నన్ను అప్పుడే వానప్రస్తం స్వీకరించ మంటావా ఏమిటి?'

'కాకపోతే రాజకీయాలు వృత్తిగా స్వీకరించండి. మీలాంటివాళ్లు ఆ వృత్తిలో 'షైన్' కావచ్చు. మీ పద్ధతులు అక్కడ బాగా పనికొస్తాయి. న్యాయవావృత్తిలోద ఆ పద్ధతులు పనికిరావు సార్. అందు వల్ల యీ వృత్తి మీకూ లాభదాయకం కాదు – ఆ వృత్తికీ శ్రేయస్కరం కాదు.'

ఆలోచిస్తే అల్లుడు చెప్తున్నమాట లోనూ 'రీజన్' కన్పించింది రంగారావుకు. 'పొలిటీషియన్' కావాలన్నది తన చిర కాల వాంఛ. అల్లుడిపుణ్యమా అని అది తీరుతోం దిప్పుడు.

ఎన్నో ఏళ్ళుగా ఆ యింటిముందు వేలాడుతున్న 'రంగారావు, బి.ఎ.బి.ఎల్, అడ్వొకేట్' అన్న పాతబోర్డు స్థానంలో, కె. మురళీమోహన్. బి. ఎ. బి. ఎల్. న్యాయవాది' అన్నబోర్డు వెలిసింది.

ఆ బోర్డుల మార్పిడీ జరిగిన రోజు రాత్రి –

సత్యవతి అతని గదిలోకి వెళ్ళింది. అతను 'లా' పుస్తకంకు బదులుగా ఆమె వ్రాసిన పాతనవల నొకదాన్ని చదువు తున్నాడు.

ఆమె ఆ పుస్తకం మూసేసి తనని పలకరిస్తాడని ఎదురుచూచింది. ఊహుఁ. ఎంతకూ దాన్ని వదలందే.

తనేవెళ్ళి ఆ పుస్తకాన్ని మెల్లగా లాగి అవతలపడేసి నవ్వింది సత్యవతి.

'నువ్వప్పుడే వచ్చావా? కాస్సేపు నవలేదైనా వ్రాసుకొంటావనుకొన్నాను–'

అన్నాడే కాని అతనికీ తెల్సు, ఆమె యిక అలాంటి నవలలు వ్రాయదని – వ్రాయలేదని. కలలు కనేకాలం, కోరిక లను పెంచుకొనే కాలం గతించిపోయింది. వాస్తవ జీవితం రుచిచూస్తూ, కోరికలను అందినంత మేర తీర్చుకొనే కాలం వచ్చింది.

'ఊహూ–' అందామె–'ఇంకా ఎందుకు నేను నవలలు వ్రాయటం? మీ రున్నా రుగా నాకు!'

అత నామెను అప్యాయతతో దగ్గరికి తీసుకొన్నాడు.